


# నావనడక

గండ్రేటి పెంటయ్య

సముద్రంవంకే సాలోచనగా చూస్తూ కూర్చున్నాడు సాంబమూర్తి. కెరటాలు ఒకటి వెనుక మరొకటి విరామం లేకుండా వస్తున్నాయి. వస్తున్న కెరటాలను నేర్పుతో దాటుకుంటూ బెస్తవాళ్లు నావల్లో తిరుగుతున్నారు చేపలకోసం. సముద్రమంతా కల్లోలంగా వుంది. ఐనా నావలు నడుస్తూనే వున్నాయి. చల్లని గాలి ఒంటికి తాకుతున్నా మనస్సు చల్లారడంలేదు మన సాంబమూర్తికి. మసిష్కంలో ఆలోచనలు తెగ పుట్టుకొస్తున్నాయి, కాని ఒక్కటీ నిలవడం లేదు ఆ కెరటాలకు మల్లే

'సంసారం మహాసాగరం' తనలోనే గొణుక్కున్నాడు. సంసారానికి సాగరానికి చాల పోలిక కనిపించింది మన సాంబమూర్తికి. సాగర సామీప్యం ఆహ్లావకరంగానే వుంది. కాని అది చేసే హోరు భయంకరంగానూ ఉంది. వస్తున్న ఒక్కొక్క కెరటం తన సంసారంలో రేగిన ఒక్కొక్క కలతను గుర్తుచేస్తున్నది. తన జీవననావ

[illegible] సరయిన రీతిలో నడవలేకపోవడానికి కారణ మేమిటి? మార్గం మధ్యలో మరో మార్గానికి మళ్ళించడం తన తరమౌతుందా? ఇది, యింకా ఎన్నో ప్రశ్నలు తన మస్తిష్కంలో.

"ఆనందరావూ, నీ సంసారం సుఖసాగరమోయి! నీవు అదృష్టవంతుడివి సుమా! నీవారు నీకు దేవుడిచ్చిన వరం. నీ జీవననావకు చక్కగా అమరిన చుక్కాని నీ యిద్దరి పిల్లలు రెండు జీవనజ్యోతులు. అందుకే నీ జీవితం సాఫీగా సాగుతున్నది" ఆనందరావు యింటికి వెళ్ళివచ్చిన సాంబమూర్తి యిలా తలపోశాడు.

తను ప్రతిరోజూ చూస్తూనేవున్నాడు. ఆఫీసుకి అడుగుపెట్టినది మొదలు అందరి దృష్టి పాపం ఆనందరావుమీదే. ఆఫీసులో అందరూ కలిసి మొత్తం ఆరుగురు పనిచేస్తున్నారు. తను యు డి సి గా వున్నాడు పెద్దగుమాస్తా పరమానందం, మరి నలుగురు ఎల్. డి. సి. లు. అందులో మన కథకు కారకుడైన ఆనందరావూ ఉన్నాడు. ఆనందరావు ఎల్.డి.సి. అందరికంటే అతి చలాకీ మనిషి రోజుకో డ్రెస్ మార్చకపోయినా, పరిశుభ్రమైన డ్రెస్‌లో యెప్పుడూ శుభ్రంగా ఆనందంగా కనిపిస్తాడు. చురుగ్గా పనిచేస్తాడు. అదీ మిగతావాళ్ళందరికీ మంట.

తమలా పదిహేనురోజుల కొకజత మారుస్తూ, కాలెక్కిన గారపళ్ళతో, యిస్త్రీలేని, ఓనిగినబట్టల్లో, బుగ్గన నిత్యతాంబూలం, చేత బీడీకట్ట, మాసిన గడ్డంతో జీవచ్ఛవాల్లా ప్రత్యక్షమయ్యుండే ఫరవాలేకపోయున్ను. అతడిది గుమస్తా బ్రతుకులా కానరావడమేలేదని అందరి ఆర్గ్యుమెంటూను.

పరమానందం యితడికంటే రమారమి రెట్టింపు జీతం తీసుకుంటున్నాడు. యింకా వేన్నీళ్ళకు చన్నీళ్లలా యేదో అటుఇటుచేసి ఆమాత్రమీమాత్రం ఆర్జిస్తున్నాడు కూడ. ఐనా ఆనందరావుతో సమానంగా ఉండలేకపోతున్నాడు. ఆఫ్టరాల్ ఎల్ డి సి. ఆనందరావు తనకుమించినట్టు కనిపించడం తలకొట్టేసినట్టు ఫీలవుతాడు. ఆనందరావుని చూసి అసూయపడ్డంలో గూడ అర్థముందంటాడు. సాంబమూర్తిది కూడా సరాసరి అదే పాయింటు. మరి మిగతా ముగ్గురూ యించుమించుగా కాకున్నా, ఆనందరావు కంటే నాలుగురాళ్లెక్కువే సంపాదిస్తున్నాడు ఐనా 15వ తేదీనుండే అప్పులకోసం తిరిగితే గాని గడవదు.

గుమస్తాగిరి వెలగబెడుతున్న ప్రతివాడు గాడిదలా నడుచుకోవాలన్నది యీ ఆఫీసు హెడ్ గుమస్తాగారి సిద్ధాంతం.

ఆనందరావు తమలా నడుచుకోవడం

ఆఫీసు టైమువరకు అటు యిటు తిరుగుతూ, అవీ ఇవీ తర్కిస్తూ, కేంటీన్ నుండి ఆఫీసుకు ఆఫీసు నుండి కేంటీన్‌కు తిరుగుతూ, లేదా యేదైనా కేస్ రికార్డ్ కనిపించడంలేదంటూ రోజంతా ఆఫీసును గాలిస్తూ గడిపి వేయడానికి అలవాటుపడ్డ ప్రాణులు ఇకపోతే, నోట కిళ్ళీ, చేత బీడీలేకుంటే అసలు ఐడే నడవదన్నది వాళ్ళ నమ్మకం గూడ. సాయంత్రం ఐదు వరకు అలానే నడుస్తుంది వాళ్ళాఫీసు. ఆ తర్వాత ముఖ్యమైన ఫైళ్లతో పోరాటం ప్రారంభమౌతుంది. అంతకూ పూర్తి గాని ఫైళ్ళు యిళ్ళకుకూడ వెళతాయి. కాని యెలా వెళ్ళిన ఫైలు అలానే తిరిగి రావడం గూడ మామూలే.

ఆనందరావు వీళ్ళందరికీ విరుద్ధం. ఠంచనుగా టైముకు రావడం, ఉన్న పని చేసుకోవడం, పనిచేసుకుంటూనే సరదాగా మాట్లాడడం మళ్ళీ టైముకి ఆఫీసుని వదలడం. ఒక్కనాడు గూడ ఒక్క పైస అప్పు అడగడం వాళ్ళు చూడలేదు. అప్పులవాళ్ళుకూడ అతని వెంట తిరగడం యేనాడూ యెవ్వరూ చూడలేదు.

అందరి అనుమానం యేమిటంటే ఆనందరావుకి డబ్బుదగ్గర యిబ్బందే లేదు. బహుశా సైడ్‌బిజినెస్ లాంటి దేదో చేసి మస్తుగా సంపాదిస్తున్నాడు. కొన్నాళ్ళపాటు సి. ఐ. డి. లా పని చేశారు. ఐనా రూఢిగా తెలుసుకోలేక పోయారు.

అతడు తరచు పెద్దబజారులో యెదురుపడుతుంటాడు. అందుకు అతడి బిజినెస్ సెంటర్ అక్కడెక్కడో ఉండాలని పరమానందం అంటాడు. అతడన్నదే తడవుగా, సాంబమూర్తి తన సంశోధనా ఫలితం వెలిబుచ్చాడు. అతడు కె. కె అండ్ కో. లో చాలాసార్లు కూర్చోవడం చూశానన్నాడు. ఇంకే ముంది, ఆనందరావు ఆ కంపెనీ పార్టనర్ తప్పకుండా అయ్యుండాలి. అదే ఋజువైతే వాళ్లేంచేయాలి—అన్నది నిర్ణయించుకోవడం కూడా మొదలెట్టారు.

ఉద్యోగం చేస్తూ సైడ్ బిజినెస్ చేయడం నేరం అందుకు ఆనందరావును కోడ్ రూల్సుకు యీడ్చి, యేడిపించి, ఎడు చెరువుల నీళ్ళు పట్టించి మరీ విడిచిపెట్టాలి. అంతేకాకుండా యీ రోజుల్లో ప్రభుత్వం బ్రతుకుతెరు వుంటుండగా మరో బ్రతుకుతెరువుపై అడుగుపెట్టడం ఒప్పుకోదగ్గది కాదు. అందుకతడు యేదో ఒకదానికి నీళ్లొదులు కోవాలి. లేదా అప్పుడప్పుడు తమకు కావలసిన డబ్బు సర్దుబాటు చేయడానికి అంగీకరించవలసిందే. ఇకపోతే ఆనందరావును సాక్ష్యాలతోసహా పట్టు కోవాలి. అందరికంటే సాంబమూర్తి

స్మార్ట్‌గా కనిపించడంతో, అతడికే అన్ని పవర్సు యిచ్చేశారు, ఆనందరావుని పట్టుకొనే బాధ్యతతోపాటు.

సాంబమూర్తి పరిశోధనారంగంలోకి దూకాడు. ఆరోజు ఆనందరావుతో పాటే బయలుదేరాడు ఆఫీసునుండి. ఇద్దరూ కలిసి అదీఇదీ మాట్లాడుకుంటూ ఆనందరావు యింటిమలుపు దగ్గరకు చేరారు. అక్కడ సాంబమూర్తి విడిపోవాలి. కాని ఆనందరావుని వెంటాడి పట్టుకోవాలని అతని పట్టుదల. ముందుగా అతని యిల్లు చెక్ చేయాలి. తరువాత కె కె. అండ్ కో లో పట్టుకోవాలి. లేదా పెద్దబజారులో పట్టుకొని వెంటాడి కనిపెట్టాలి. అదీ అతని ప్లాను.

"మీ రెక్కడుంటున్నారు, ఆనందరావుగారు ?" అడిగాడు సాంబమూర్తి.

"ఇక్కడే, ఒక ఫర్లాంగు దూరంలో. రండి మా యిల్లు చూద్దురుగాని. మీ రెప్పుడూ రానేలేదు" అవకాశం కోసం చూస్తున్న సాంబమూర్తి అడుగు ముందుకు వేశాడు. సాంబమూర్తిని యింటికి తీసుకువెళ్ళాడు ఆనందరావు.

ఆనందరావు, సాంబమూర్తి యిల్లు చేరారో లేదో, ఆనందరావు పిల్లలిద్దరూ 'నమస్తే అంకుల్' అంటూ నవ్వుముఖాలతో స్వాగతం చెప్పారు సాంబమూర్తికి. ఆనందరావు వాళ్లను రెండు చేతుల్లోను ఎత్తుకున్నాడు చెరొకవైపు.

పిల్లలను చూసిన సాంబమూర్తి కళ్లు జిగేలుమన్నాయి. పిల్లలిద్దరూ తామరాకుపై నీటి బిందువుల్లా, కడిగిన ముత్యాల్లా కనిపించారు, సాంబమూర్తికి. తన పిల్లలు జ్ఞాపకానికొచ్చారు. గుండీల్లేని షర్టుల్లో, కుట్టువిడిన మాసిన నిక్కర్లలో, వీధిలో ధూళంతా తమపైనే ఉందంటూ చీమిడి ముక్కులతో ప్రత్యక్షమౌతుంటారు తను వెళ్లేసరికి.

ఇంటిముందు అందమైన అతి చిన్న గార్డెన్. జాగా చాలా చిన్నదైనా వెదురు బద్దలతో ఫెన్సింగ్ చేసి, పూలమొక్కలను పెంచారు. ఇల్లు తాటికమ్మలతో నేసిన పూరిల్లు. రెండు గదులున్నట్టు ఉన్నాయి గుమ్మానికి ఒకవైపున వంటచేసుకోవడానికి చిన్న కిచెన్‌లా వుంది. ఇల్లంతా అలకబడి ముచ్చటగా ముగ్గులతో పరిశుభ్రంగా వుంది.

"రండి లోపలకు" అంటూ లోనికి ఆహ్వానించాడు సాంబమూర్తిని. ఆనందరావు ఒక గదిలోనికి తీసుకుపోయి కూర్చోబెట్టాడు.

సాంబమూర్తి గదిని పరిశీలనగా చూడడం మొదలెట్టాడు. ఉన్న కొన్ని వస్తువులు చక్కగా పేర్చబడి వున్నాయి. చిన్న టేబిల్, రెండు ప్లాస్టిక్‌తో అల్లిన కుర్చీలు, టేబిల్‌పై క్లాత్, దానిపై చిన్నసైజు రేడియో, తను తన శ్రీమతి ఫోటోలతో స్టేండ్, రెండు ఫ్లవర్ వేజులు, కొన్ని మేగజిన్లు పేర్చబడి వున్నాయి. గోడలకు

అక్కడక్కడ ఫ్రేమ్‌కట్టిన ఫోటోలు, కేలండర్లు ఉన్నాయి. ఒక గోడకు పుస్తకాల స్టేండ్, మరో ప్రక్క చిన్న గోడఅలమారు, దాన్నిండా రంగు రంగుల రకరకాల బొమ్మలున్నాయి. ఒకప్రక్క బట్టల స్టాండ్, ఒకమూలన ఉషా కుట్టుమిషను వున్నాయి. ఎక్కడి వస్తువులక్కడ పేర్చబడి గది ముచ్చటగా కనిపించింది. ఆ ప్రక్క నున్నది బెడ్‌రూము అయ్యుండొచ్చు. మిగతా సామాన్లన్నీ ఆ గదిలోనే ఉండొచ్చు ననుకున్నాడు సాంబమూర్తి. తన యిల్లు తలంపుకవచ్చి తల తిరిగి పోయినట్టయింది సాంబమూర్తికి. ఏ వస్తు వెక్కడుంటుందో యెంత వెదికినా కనిపించదా యింట్లో. తన యింట్లో నున్నంత కంగాళీ వీధిలో కూడా వుండదనిపించింది. ఇంతలో -

"నీలిమా" అంటూ శ్రీమతికై కేక వేశాడు ఆనందరావు. అంతవరకు మరో గదిలో వున్న ఆమె దగ్గరకు వచ్చింది.

"నీలిమా, యీయన సాంబమూర్తి గారని మా ఆఫీసులో యు.డి.సి. గా పనిచేస్తున్నారు," అని "ఈమె నా శ్రీమతి, పేరు నీలిమ'' అంటు సాంబమూర్తికి నీలిమను పరిచయంచేశాడు. పేరుకుతగ్గ అందాన్ని చూడగలిగాడామెలో సాంబమూర్తి. పరిశుభ్రమైన నీలిరంగు చీరలో, గుండ్రని కుంకుమ బొట్టుతో, నిర్మలమైన ఆకర్షణీయమైన ముఖంతో పదహారణాల తెలుగు యిల్లాలులా ఉంది. సాంబమూర్తికి తన భార్య జ్ఞాపకాని కొచ్చింది. కారెక్కిన ఎరుపు చీరలో, బుగ్గలపై నున్న గంట్లు కప్పుతూ పౌడరు అద్దిన ముఖంతో, నుదుట కనీకనిపించని చౌకబారు తిలకం బొట్టుతో, మోటు పెదవులతో, మదిలో మెదిలింది. నీలిమకు తన భార్యకు ఎంతో తేడా కనిపించింది.

"నమస్కారమన్నయ్యగారూ" అన్నది నీలిమ.

సాంబమూర్తి ఏం మాట్లాడాలో తోచక రెండుచేతులు జోడించాడు నీరసంగా. తరువాత నీలిమ వెళ్ళిపోయింది అతిథి సత్కారపు ఏర్పాట్ల కోసం. పిల్లలిద్దరూ ఆటకు పోయారు. ఆనందరావు సాంబమూర్తి మాటలకు దిగారు.

"అప్పుడప్పుడు మీ ఫేమిలీనితీసుకు వస్తూ ఉండండి. మీ యిల్లెక్కడో చెప్తే మేము కూడ వస్తుంటాము. ఎంతయినా ఒకే ఆఫీసులోవాళ్లం. కుటుంబాలు కలిస్తే స్నేహం పెరుగుతుంది," అన్నాడు ఆనందరావు.

"తప్పకుండా తీసుకువస్తాను. మా యిల్లిక్కడికి ఎంతో దూరముండదు" అన్నాడు సాంబమూర్తి.

"ఈ వీధిలో యిరుగుపొరుగులు




యెవరిమట్టుకు వాళ్లే వుంటారు. ఇకపోతే నాకు కాలక్షేపం ఈ పిల్లలతోను మా శ్రీమతితోను గడిచిపోతుంది. ఏమీ తోచనప్పుడలా పెద్దబజారుకెళ్ళి కే. కె. అండ్ కో లో పని చేస్తున్న మా స్నేహితుడితో గడుపుతుంటాను. అతడు నా క్లాస్‌మేట్. చాల యింటిమేట్ కూడ." కె. కె. అండ్ కో కి ఆనందరావుకి ఉన్న అనుబంధ మిదా అని తెలిసిన సాంబమూర్తి పాపం నీళ్లకారిపోయాడు.

ఎదురుగా కుట్టుమిషను కనిపించ డంతో, "మీకు కుట్టడం వచ్చునను కుంటాను" అనడిగాడు సాంబమూర్తి.

"నాకే కాదు. మా నీలిమకు కూడ తెలుసును. ఈ మిషను మా పెద్దాడి పుట్టుకకు వాడి తాతాగారిచ్చారు. ఈ రేడియో పెళ్ళికి నీలిమ తెచ్చినది."


"మీరు తొడుక్కున బట్టలు మీరు కుట్టుకున్న వేనా ?"

"అబ్బే కాదండి. ఇది మా నీలిమ కుట్టినవి. నిజం చెప్పాలంటే మా బట్టలు మేమే కుట్టుకోవడం మాకు చిన్నతనం కాదు సుమండీ. అసలిదే కాదు మాకే పని యింతే. వీలైనంతవరకు ఏ పనీ స్వయంగా చేసుకోవడం మా కలవాటు. దీనివల్ల డబ్బు ఖర్చు తగ్గడమేకాకుండా మన అవసరానికి అమరుతుంటాయి. మా బట్టలు మేమే ఉతుక్కుంటాం. ఇస్త్రీ చేసుకుంటాం. మా జోళ్ల మరమ్మత్తు పాలిష్ చేసుకోవడం మొదలు అన్ని పనులు స్వయంగానే చేసుకుంటాం" అన్నాడు నవ్వుతూ ఆనందరావు.

"ఆహా, అలాగా ?" అన్నాడు సాంబమూర్తి కొంచెం ఆశ్చర్యపోతూ.

అతడు ఆశ్చర్యపోవడానికి కారణం లేక పోలేదు. తనింట్లో అలాంటి పనేదీ చేతకాదు అన్నిటికీ వృత్తిదార్ల మీద ఆధారపడవలసిందే. అణా పైసలతో చెల్లించుకోవలసిందే.

"ఈ వైరింగ్ చూశారా ? కేవలం సామాగ్రి కొన్నాను. మిగతా పనంతా నీలి సాయంతో నేనే స్వంతగా చేశాను తెలిసిన కంట్రాక్టర్‌తో చెక్ చేయించాను. రేడియో రిపేర్ అంతగా రాకపోయినా కొద్దిపాటి ఐడియా వుండ బట్టి చిన్నచిన్న లోపాలొచ్చినప్పుడు సరిచేయగలుగుతున్నాను. అదే షాపుకు తీసుకుపోతే వాళ్ళు చేసే ఛార్జికి మన కళ్ళంటుకుంటాయి ఏమంటారు ? ఈ కుర్చీలు చూడండి. రాడ్లు ప్లాస్టిక్ మాత్రమే కొన్నాను. తెలిసిన వర్క్ షాపులో వెల్డింగ్ చేయించాను అతి తక్కువ ఖర్చుతో. వాటిని ఫైలింగ్ చేసి, రంగులు పూసి నేనే స్వంతంగా అల్లాను. అంటే యివి చాలా తక్కువ ఖర్చుతో తయారయ్యాయి ఇలాగే ఎన్నో. అన్ని పనులు నేర్చుకోవాలన్న కోరిక ప్రతి సంసారికివుండి అవకాశాన్ని జారవిడుచుకోకుండా నేర్చుకుంటే ఇంటికి కావలసిన అన్ని హంగులను అతి చౌకలో అమర్చుకోవచ్చును. రోజులు గడవని యీ రోజుల్లో అనవసరపు ఖర్చులు మన బ్రతుకులను పరిహీనం చేస్తాయి. ముప్పయి రోజులు కష్టపడినా మూడువందలు కిట్టని మనలాంటి బ్రతుకులు ఒక్కొక్క పైస లెక్కించి ఖర్చు చేస్తేగాని ముందుకు కదలడం కష్టమౌతుంది. ఎందరో యిల్లాళ్ళకు అంట్లు తోమాలంటే నామోషీ. అలాగే చాలమంది భర్తలు భార్యచేత అలాంటి పనులు చేయించాలంటే బాధపడతారు కూడ. మన గృహిణి పనిచేయగలుగుతున్నప్పుడు పనిమనిషిని పెట్టుకోవడం నామోషీగా భావించడం పొరపాటు. మనింటి పనిమనిషి మరో యింటి గృహిణి. ఆమె తన పనిని పూర్తిగా చక్కబెట్టుకొని, డబ్బుకే అనుకోండి మనింటికి వచ్చి పనిచేయడానికి తయారవగలుగుతున్నప్పుడు, మనింటి పనిని మన గృహిణిలు చేసుకుంటే తప్పేముంది చెప్పండి. దీనివల్ల ఒకరిపై ఆధారపడనవసరంలేదు. పైగా మన ఖర్చు తగ్గుతుంది మా పిల్లలకు మేమే ట్యూషన్ చెప్పుకుంటాం. ఉదయంపూట నేను చెప్తే సాయంత్రం మా శ్రీమతి చెప్తుంది. తరువాత మా యిద్దరిమధ్య మరో ఉత్సాహకరమైన పోటీ కూడ వుంది సుమండీ. అదేమిటంటే నెలాఖరు వరకు మా యిద్దరిలో ఎవరు తక్కువగా ఖర్చుపెట్టగలుగుతే, వాళ్లు మిగిలిన డబ్బుతో కోరుకున్న వస్తువును కొనుక్కోవచ్చును. దీనివలన నెలాఖరు వరకు యిబ్బందిలేకుండా గడవడమే కాకుండా నాలుగు పైసలు మిగులుతున్నాయి.




మిగిలిన డబ్బు ఎవరమో ఒకరం ఖర్చు పెట్టుకోవచ్చును కాని మాకు ఖర్చులే వుండటంలేదు. అందుకు అవి మాపిల్లలకు పనిచేస్తాయని ఉంచుతాం. మాకైనా అవసరానికి పనికిరావచ్చును గదా! అవసరమైన ఖర్చులు నా కసలేం వున్నాయని ? ఒక పేకట్టు బ్లేడ్స్ కొంటే రెండుమూడు నెలలు గడిచిపోతాయి ఒక షేవింగ్ సోప్ ఆరు నెలలకు తక్కువరాదు. బయటఖర్చు నా కేమీ లేదు ఏం తిన్నా యింటిదగ్గరే అసలు మా యింటి పద్ధతే అంత. ఈ కరువు రోజుల్లో అన్నిటికీ డబ్బు వెదజల్లా లంటే మాటలా ?" యిలా చెప్పుకు పోతున్నాడు ఆనందరావు

ఆనందరావు చెబుతున్న ఒక్కొక్క ఎకనామికల్ పాయింటు తనతో పోల్చి చూసుకున్నాడు సాంబమూర్తి. తన ఖర్చు తన బ్రతుకు అంతా అయోమయం బంకలా వదలని అప్పు వాళ్ళకు అలా యిలా నచ్చజెప్పి సగం తీర్చి, మిగతా సగం జీతంతో యింటికి జేరతాడు తను. పదిరోజులవరకు తను, శ్రీమతి నిశ్చింతగానే ఖర్చు చేస్తారు. తనకు రోజూ రెండు బీడీకట్టలు ఒక అగ్గిపెట్టె - పదికి తక్కువకాకుండా కిళ్ళీలు అవసరం ఉదయం టీ పదికి మంచికూరలతో భోజనం, మధ్యాహ్నం టిఫిను, టీ, సాయంత్రం ఓస్లీ టీ, రాత్రికి డబ్బుంటే ఒక్కచుక్క మందు, ఆ తరువాత నిషాకోసం మషాలా కూరలతో భోజనం కావాలి. వారంకి ఒక్కసారి షేవింగ్. అదీ సన్యాసి షాపులోనే ఇక శ్రీమతికి చిరుతిళ్ళ అలవాటు. వచ్చిన ప్రతి సినిమా చూసి తీరాలి. రోజుకి నాలుగుసార్లు టీ త్రాగ

కుంటె కాళ్ళు పకుతాయి. ఇంకా కనిపించని ఖర్చులెన్నో. ఇకపోతే పిల్లలిద్దరూ తమకు తక్కువకారు. అడిగి తీసుకొని ఖర్చుచేయడం సరేసరి. డబ్బు కంటబడితే చాలు మరి మన కంట బడరు వాళ్లు అందుకే తన బ్రతుకిలా తగలడుతుంది. అప్పులవాళ్ళ వెంట అవస్థపడవలసి వస్తున్నది.

ఆనందరావు భార్య కాఫీ కప్పులతో ప్రవేశించింది. సాంబమూర్తి ఆనంద రావు కాఫీ త్రాగడమైంది. మళ్ళీ ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు. ఆనంద రావు అతి జాగ్రత్తగా గడుపుకు రావడం, దానికి అతని భార్యయిస్తున్న చేయూత సాంబమూర్తికిముచ్చటేసింది.

ఇక వస్తానంటూ లేచాడు సాంబ మూర్తి. ఆనందరావు, అతని భార్య, పిల్లలు ఒకేసారి నవ్వుతూ వీడ్కో లిచ్చారు.

"అన్నయ్యగారూ, వదినను తీసుకు రండ"ని ఆనందరావు భార్య చెప్పింది.

"అలాగేనమ్మ, తప్పకుండా వస్తాం," అంటు బయలుదేరాడు.

మలుపు తిరిగేటప్పుడు మరోసారి వెనక్కు తిరిగి చూశాడు సాంబమూర్తి. ఇంకా అలాగే చూస్తూ నిలబడ్డారు ఆనందరావు వాళ్ళు. 'ముచ్చటైన కాపురం' అనుకున్నాడు సాంబమూర్తి.

'కలకాలం నీ కాపురం కళకళ లాడాలి. నూరేళ్ళు నీ సంసార మిలాగే సంతోషంగా సాగాలి ఆనందరావూ' అని మనస్సులోనే అనుకున్నాడు, ఎద పరిశోధనకని వచ్చి వెళుతున్న సాంబమూర్తి

నడుస్తున్నా సాంబమూర్తి ఆలోచి స్తూనే వున్నాడు. ఇంటికి పోతాననుకున్న సాంబమూర్తి యింటికి వెళ్ళకుండానే తిన్నగా బీచ్‌కు వచ్చిచేరుకున్నాడు.

"పరమానందం, సోమయాజులూ, గవర్రాజు, రాఘవులూ, చూశారా ? మందీ ముందుచూపులేని నడక. పరిమితి లేని వ్యయం అది ఒట్టి ఫాల్తూ ఖర్చు మనకు ఆనందరావుకుయిదీతేడా.

నీలిమ ఆనందరావుకు దేవుడిచ్చిన వరం. సంసార సాగరాన పయనిస్తున్న అతని జీవన నావకు ఆమె అతి చక్కగా అమర్చబడిన చుక్కాని. అందుకే ఒడుదుడుకులులేక సాఫీగా సాగుతున్నది అతని జీవనయాత్ర.

ముప్పయిరోజుల కష్టఫలాన్ని ముష్టికి (అప్పుకు) తిరక్కుండా ముప్పయి రోజులూ సరిపెట్టుకుంటూ యేమైనా మిగుల్చుకోగలిగినప్పుడే మనం ధీమాగా ముందుకు సాగగలం. అందుకు మనం మారాలి. మన ఆడవాళ్ళతో మారాలి. ఆనాడే మనం ఆనందరావులా, యింకా అతనికంటే ఎక్కువ ఆనందంగా వుండగలం.

చకచక అడుగులేసుకుంటూ యింటి ముఖంపట్టాడు సాంబమూర్తి. జేబులోని బీడీకట్టను నీటిలోకి విసిరేసి, కాలుతున్న బీడీని కసిగా యిసకలో అణిచేసి.